

మళ్లీ బాదేశారు

రూ.35 కోట్ల భారం

- ముని్సపాలీ్టల్లో పెరగనున్న ఆస్తి పన్ను
- వరుసగా మూడో సారి పెరగనున్నవైనం
- పెరిగిన పన్నులు ఏప్రిల్ ఒకటి నుంచి వసూలు
- ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం పుర పౌరులపై మరో సారి ఆర్థిక భారం మోపనుంది. ప్రభుత్వం బాదుడే బాదుడు అన్న నినాదాన్ని అమలు చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. చెత్త పన్నుకు తోడు ఆస్తి పన్ను పెంపుదలపై పట్టణవాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా వీరి మొర ఆలకించే వారే లేరు. మున్సిపాలిటీల పరిధిలోని ఆస్తి పన్ను పెంచేందుకు రంగం సిద్ధమైంది. ఆస్తి పన్ను పెరుగుదలకు హద్దు లేకుండా పోతున్నది. ప్రజల జేబును ఎన్ని విధాలుగా ఖాళీ చేయవచ్చో మున్సిపాలిటీల్లో నూతన ఆస్తి పన్ను విధానం తెలియజేస్తున్నది. ప్రస్తుతం ఉన్న పన్నును మరో 15 శాతం పెంచనున్నది. పెరిగిన ఆస్తి పన్ను ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి రానున్నది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలలో ఉన్న పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం మార్చేసింది. ఆస్తిమార్కెట్ విలువ(రిజిస్ట్రేషన్ విలువ) ఆధారంగా పన్నును విధిస్తున్నది. దీని ప్రకారం ఆస్తి విలువను మార్కెట్ విలువ ప్రకారం మదింపు చేసి, దాని ఆధారంగా ఆస్తి పన్ను విధిస్తున్నారు. గతంలో అద్దె విలువ, మున్సిపాలిటీలో జోన్ల వారీగా విభజించి ఆస్తి పన్ను విధించేవారు. భవన నిర్మాణ కొలతలను పన్ను విధింపులో పరిగణనలోకి తీసుకునేవారు. గతంలో భవనానికి మాత్రమే పన్ను విధించే వారు. 1997 నుంచి అమల్లో ఉన్న దీనిని వైసీపీ ప్రభుత్వం మార్చేసింది. వైసీపీ ప్రభుత్వం కొత్త విధానంలో భవనంతో పాటు, భవనం నిర్మించిన స్థలం, ఒక వేళ భవనం చుట్టూ ఖాళీ వదిలితే దానికీ పన్ను విధిస్తున్నారు. ఆస్తి విలువ ఆధారంగా విధిస్తున్న పన్ను ఏటా పెరుగుతోంది. క్యాపిటల్ వాల్యు ప్రకారం పన్ను నిర్ణయించిన సమయంలో గతంలో చెల్లిస్తున్న పన్నుకు కొత్త విధానంలో నిర్ణయించిన పన్నుకు మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారిస్తారు. తేడా ఉన్న పన్ను ఏటా 15 శాతం పెరుగుతుంది. మార్కెట్ విలువకు సమానం అయ్యే వరకు పన్ను ఆ మాదిరిగా పెరుగుతూనే ఉంటోంది.

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పురపాలక సంఘాలు, గుంటూరు కార్పొరేషన్‌లో పుర పౌరులపై దాదాపు రూ.35 కోట్లు ఆస్తి పన్ను భారం పడనున్నది. ఆస్తి పన్ను విషయంలో ప్రభుత్వ తీరు తగ్గేదేలే అన్న రీతిన ఉన్నది. నరసరావుపేటలో పన్ను డిమాండ్ సుమారు రూ.7.47 కోట్లు. ఈ ప్రకారం 15 శాతం పన్ను పెరగడంతో మున్సిపాలిటీ ఆదాయం దాదాపు రూ.1.12 కోట్లు వరకు పెరగనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే రీతిలో మిగిలిన మున్సిపాలిటీల్లో కూడా పన్నులు అమాంతం పెంచేశారు. ఈ పెరిగిన పన్నులను ఏప్రిల్ నుంచి వసూలు చేయనున్నారు. ఆ ప్రకారమే యజమానులకు పన్నుల రశీదులు అందనున్నాయి.



16 దాటినా.. పస్తులే..



- 21,212 ఉద్యోగ కుటుంబాల్లో ఆకలి కేకలు
- దారుణంగా వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల పరిస్థితి
- జనవరి జీతం మార్చిలో వేస్తామనే సందేశాలపై ఆందోళన

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 16: గతంలో పీఆర్సీ, డీఏల కోసం ఎదురు చూసే ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పుడు జీతాల కోసం పడిగాపులు కాయాల్సి వస్తుంది. ముఖ్యమంగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దారుణంగా మారింది. ఏ నెలలో కూడా ఠంచన్‌గా జీతాలు తీసుకున్న పరిస్థితి లేదు. ప్రతీ నెలా సగం రోజులు గడిస్తే కాని జీతం అందని పరిస్థితి. అసలే అంతంతమాత్రంగా ఉన్న జీతాలకు తోడు ఆలస్యంగా ఇస్తుండటంతో ఆయా కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. ఫిబ్రవరి నెలలో 16 రోజులు దాటినా జనవరి నెల జీతాలు రాక పోవడంపై ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కాంట్రాక్టు విధానంలో 11897 మంది, ఔట్ సోర్సింగ్ విధానంలో 9315 మంది ఆయా శాఖల్లో పనిచేస్తున్నారు. ఈ 21,212 కుటుంబాలు కేవలం జీతాల మీదే ఆధార పడి జీవిస్తున్నాయి. ప్రతి నెలా జీతాలు ఆలస్యం కావడంతో ఇంటి అద్దెలు, నిత్యావసర సరుకులు, పిల్లల స్కూల్ ఫీజుల కోసం అధిక వడ్డీకి అప్పులు చేస్తున్నట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి నెల వేతన కష్టాలు తప్పడంలేదు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టు ఉద్యోగులను కూడా గ్రీన్‌ఛానల్‌లో ఉంచి ఒకటో తేదీనే జీతాలు చెల్లించేవారు. ఇప్పుడు ఆ ఆనవాయితీ పూర్తిగా మారిపోయింది. నెల 10 తర్వాత జీతాలు పడుతున్నాయి. గత కొద్ది నెలలుగా అదికూడా గగనంగా మారింది. డ్రాయింగ్ అధికారులు సకాలంలోనే బిల్లులు పెట్టినప్పటికీ జీతాలు పెండింగ్‌లో పెడుతున్నారు. టోకెన్ నెంబర్ ఆధారంగా ఖజానా కార్యాలయాల్లో చెక్ చేస్తే నిధులు లేవని చూపిస్తుందని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఇది ఇలా ఉంటే వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల కు జనవరి నెల జీతం మార్చి లో ఇస్తారని సందేశం అందింది.

అప్పులు పుట్టాలని ఉద్యోగుల పూజలు?

ప్రతి నెల తనకు వచ్చే వేల రూపాయల జీతం కోసం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయలు అప్పు పుట్టాలని పూజలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతీ నెల ఒకటో తేదీ నుంచి వచ్చే మంగళవారాల కోసం వేలాదిమంది ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. మంగళవారం జరిగే బాండ్ల వేలంలో అప్పు పుడితే తమకు జీతాలు వస్తాయన్న ఆశతో ఉంటామని ఉద్యోగులు చెబుతున్నారు. అయితే ప్రతి మంగళవారం ప్రభుత్వం అప్పు తెస్తున్నా తమకు జీతాలు వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుట్రలు సాగనివ్వం : ఏలూరి సాంబశివరావు

అధికార పార్టీ కుట్రలను సాగనివ్వబోమని బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. మూడు రోజుల నుంచి ఏదో విధంగా సభను భగ్నం చేయాలని వైసీపీ ప్రయత్నాలను చేస్తూనే ఉందని ఆరోపించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన దుర్మార్గాలను సభ సాక్షిగా అధినేత చంద్రబాబు ఎండగట్టనున్నారని తెలిపారు. బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రా.. కదిలిరా సభకు అద్దంకి నియోజకవర్గంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలి రావాలని ఎమ్మెల్యే రవికుమార్ పిలుపునిచ్చారు.

నేడే రా కదలిరా



- ఇంకొల్లులో సభకు ఏర్పాట్లు పూర్తి
- హాజరు కానున్న టీడీపీ అధినేత చంద్రబాబు
- తారక రామ విజయభేరి ప్రాంగణంలో సర్వం సిద్ధం

ఇంకొల్లు, అద్దంకి, పర్చూరు/ బాపట్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఇంకొల్లులో శనివారం రా..కదలిరా సభకు భారీ ఏర్పాట్లు చేశారు. టీడీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడంతో పాటు వైసీపీ దుర్మార్గ పాలనను అంతమొందించాల్సిన ఆవశ్యకతను ప్రజలకు టీడీపీ అధినేత ఈ సభ ద్వారా వివరించనున్నారు. పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లు పావులూరు రోడ్డులో మధ్యాహ్నం 3 గంటలకు రా కదలిరా సభ జరగనుంది. తారకరామ విజయభేరికి దాదాపు 25 ఎకరాల స్థలంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. కనిగిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, కొండపి ఎమ్మెల్యే స్వామి తదితర నేతలతో కలిసి సభా ప్రాంగణంలో పనులను శుక్రవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పర్యవేక్షించారు. సభ విజయవంతానికి టీడీపీ, జనసేన నేతలు నియోజక వర్గాల వారీగా సంయుక్తంగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో సభకు తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు రెట్టించిన ఉత్సాహంతో టీడీపీ, జనసేన కార్యకర్తలు కదలివెళ్లడానికి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. భారీ ఎత్తున స్టేజి నిర్మాణంతో పాటు ప్రాంగణంలో భోజనం, మంచినీరు, వాహన పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సభకు నాలుగు మూలల వాహనాల పార్కింగ్‌కు స్థలాలు కేటాయించారు. పర్చూరు నియోజకవర్గం మొత్తం పసుపు తోరణాల తో కళకళ లాడుతోంది. పావులూరుకు వెళ్లే రహదారి ఇరు వైపులా చంద్రబాబుకు స్వాగతం పలికే ఫ్లెక్సీలతో ముస్తాబు చేశారు. శనివారం ఉదయం నుంచే సభా ప్రాంగణం వద్ద కళాకారులు ఆటపాటలతో అలరించ నున్నారు. గ్రామాల వారీగా రవాణా కోసం కావాల్సిన సౌకర్యాల విషయంలో నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు లక్షన్నర మంది పైనే సభకు హాజరు కావచ్చని టీడీపీ నేతలు అంచనా వేస్తున్నారు. బాపట్ల జిల్లా నేతలతో పాటు ఉమ్మడి ప్రకాశం నేతలు కూడా సభకు హాజరుకానున్నారు.


సిద్ధమవుతున్న సభా వేదిక


● జగ్జీవన్‌రామ్‌కాలనీ సమీపంలో మట్టి తవ్వకాలు జరిపిన ప్రదేశం

అడ్డగోలు తవ్వకాలు

- రాత్రి, పగలు తేడా లేకుండా మట్టి దోపిడీ
- సిమెంట్ పరిశ్రమ, వెంచర్లకు భారీగా తరలింపు
- విచ్చలవిడిగా వైసీపీ నేతలు.. పట్టించుకోని అధికారులు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 16: అధికారం మాది.. అడిగేవారు ఎవరూ.. అన్న రీతిలో కొందరు వైసీపీ నేతలు అడ్డగోలుగా ఖనిజ వనరులను దోచేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల, మాచవరం మండలాల్లో మట్టి దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. మాచవరం మండలం పులిచింతల ముంపు భూముల్లోని నల్లరేగడి మట్టిని ట్రక్కుల కొద్దీ కొందరు వైసీపీ అనుయాయులు అమ్ముకుంటున్నారు. రేగులగడ్డ, మోర్జంపాడు, మాచవరం, పిన్నెల్లి, గాంధీనగర్, పులిచింతల భూములు, చెరువులను సైతం వదలకుండా మట్టిని తవ్వేస్తున్నారు. పిడుగురాళ్ల సమీపంలోని సుందరయ్యకాలనీ, జగ్జీవన్‌రామ్‌కాలనీల వద్ద కొండ పక్కన భూముల్లోను మట్టిని పగలు రాత్రి తేడా లేకుండా ఎక్స్‌కవేటర్‌తో తవ్వు తున్నారు. తవ్వకాలను ఆ ప్రాంత వాసులు వ్యతిరేకిస్తున్నా అధికారులు పట్టించు కోవడంలేదు. తవ్విన మట్టిని టిప్పర్లతో దాచేపల్లి మండలంలోని ఓ సిమెంట్ పరిశ్రమకు తరలిస్తున్నారు. ఒక్కో ట్ర క్కు రూ.7 వేలు చొప్పున ధర నిర్ణయించి మరీ అమ్ముతున్నారు. గురజాల మం డలం దైద అటవీ భూముల్లోనూ మట్టిని తవ్వి గురజాల సమీపంలోని వెంచర్ల కు తరలిస్తున్నారు. దాచేపల్లి మండలం పొందుగల సమీపంలోని ప్రభుత్వ భూముల నుంచి కూడా మట్టిని వెంచర్లకు తరలించారు. కరాలపాడులో సుమా రు 40 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నివేశన స్థలాలు అందజేసింది. ఊరికి దూ రంగా ఉండటంతో ఏ ఒక్కరు కూడా ఇప్పటి వరకు అక్కడ నివాస గృహాలు ఏర్పరుచుకోలేదు. ఆ ప్రాంతంలో కొందరు అధికార పార్టీ నేతలు రాత్రి సమ యంలో ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తవ్వి విక్రయిస్తున్నారు. బ్రాహ్మణపల్లి, కరాల పాడు పంచాయతీరాజ్ రహదారి పక్కనే అక్రమ మైనింగ్ చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అయినా ఏ ఒక్కరు కూడా అదేమిటని అడిగే సాహసం చేయడం లేదు. రహదారి పక్కనే ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు అక్రమ మైనింగ్‌ను అడ్డుకోకపోవడంతో కొందరు నేతలు విచ్చలవిడిగా గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.


తొవ్విన మట్టిని కుప్పలుగా పోసిన దృశ్యం

అనంతకు.. ఆర్టీసీ క్యూ

వైసీపీ సిద్ధం సభకు 292 బస్సులు

- డిపోల్లోని సగం బస్సుల కేటాయింపు
- ప్రయాణికులకు మూడు రోజులు తిప్పలే
- ప్రైవేటు వాహనాల బాట పట్టక తప్పని పరిస్థితి

గుంటూరు, ఫిబ్రవరి 16: వైసీపీ సేవలో ఆర్టీసీ తరిస్తోంది. వైసీపీ సభ అంటే ఆర్టీసీ అధికారులు ఎక్కడలేని ఉత్సాహంగా బస్సులను కేటాయిస్తున్నారు. సాధారణంగా సభ జరిగే ప్రాంతం లో లేదంటే ఆ సమీపంలోని డిపోల నుంచి బస్సులను కేటాయి స్తుంటారు. కానీ కొంతకాలంగా ఎక్కడ సభ జరిగినా రాష్ట్ర వ్యాప్తం గా ఉన్న డిపోల నుంచి ప్రత్యేకంగా బస్సులను తరలిస్తున్నారు. ఆయా సందర్భాల్లో డిపోల్లో బస్సులు లేక రోజువారీ ప్రయాణాలకు సామాన్యులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించు కోవడం లేదు. ప్రయాణికుల నుంచి నిరసనలు, విపక్షాల నుంచి విమర్శలు ఎదురైనా ఆర్టీసీ యాజ మాన్యం అధికార వైసీపీ సేవలో తరిస్తోంది. అడిగిందే తడవుగా బస్సులను సమకూరుస్తూ ప్రయాణికులను గాలికివదిలేస్తోంది. తద్వారా ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరాలంటేనే ముప్పతిప్పలు పడాల్సి వస్తున్నా అటు అధికారులు, ఇటు వైసీపీ నాయకులకు పట్టడంలేదు. గురువారం గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో వలంటీర్లకు వందనం పేరిట ముఖ్యమంత్రి సభకు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఉన్న బస్సులను ఆర్టీసీ అధికారులు కేటాయించారు. ఈ కారణంగా గురువారం అంతా కూడా ఆయా డిపోల పరిధిలో సర్వీసులు లేక ప్రయా ణాలకు సామాన్యులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. ఇంతలోనే అనంతపురంలో ఆదివారం జరిగే వైసీపీ సిద్ధం సభకు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని డిపోల నుంచి సగం సర్వీసులను కేటాయించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ డిపోల నుంచి 292 బస్సులను సిద్ధం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలోని ఐదు డిపోల నుంచి 100, పల్నాడు జిల్లాలోని ఆరు డిపోల నుంచి 129, బాపట్ల జిల్లాలోని నాలుగు డిపోల నుంచి మరో 63 సర్వీసులను అనంతపురానికి పంపాలను ఆయా డిపోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. అనంత సభకు తరలించే బస్సులు పూర్తి కండీషన్ లో ఉండాలని, ఎటువంటి లోపాలు లేకుండా ముందుగానే చూసుకోవాలని ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. సభ 18న అయినప్పటికీ 17న ఉదయం నుంచే బస్సులు అనంతపురానికి తరలించాలని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. అసలే అరకొరగా సర్వీసులో ఉన్న కండీషన్ బస్సులను సిద్ధం సభకు తరలించడంతో మిగిలిన డొక్కు సర్వీసులను ప్రయాణికులకు వినియోగిస్తున్నారన్న విమర్శలున్నాయి. శనివారం నుంచే సిద్ధం సభకు ఆర్టీసీ సర్వీసులు మొత్తం 292 సర్వీసులు తరలించనున్నట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. తిరిగి సోమవారం రాత్రికి బస్సులు డిపోలకు చేరుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో శనివారం ఉదయం బయల్దేరే బస్సులు తిరిగి సోమవారం డిపోలకు చేరే అవకాశం ఉంది. ఈ క్రమంలో శనివారం నుంచి సోమవారం వరకు ఆయా డిపోల పరిధిలో బస్సులు అందుబాటులో ఉండవు. అంటే ఈ మూడు రోజులు ప్రయాణాలకు సామాన్యులు ప్రత్యామ్నాయాలు చూసుకోవాల్సిందే. శని, ఆది, సోమవారం మూడు రోజుల పాటు ఆర్టీసీ ప్రయాణికులకు ప్రయాణ భారం తప్పని పరిస్థితి నెలకొన్నది. ప్రైవేటు వాహనాల బాట పట్టాల్సిన పరిస్థితి నెలకొన్నది..





పంటలకు మద్దతు ధరల

చట్టం చేయాలి

- గ్రామీణ భారత్ బంద్ ర్యాలీలో సీఐటీయు డిమాండ్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 16: పంటలకు మద్దతు ధరల చట్టం, నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెలో భాగంగా నరసరావుపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూయాజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు కార్డులు, రుణాలు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకానికి 200 రోజుల పనిదినాలు, రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. కౌలు రైతు సంఘం నాయకుడు కామినేని రామారావు మాట్లాడుతూ రైతాంగ పోరాటంలో అమరులైన 725 కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలన్నారు. శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ శివకుమారి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రధాని నరేంద్రమోదీ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చి సంఘాలు పెట్టుకునే హక్కు లేకుండా చేశారన్నారు. కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ మాట్లాడుతూ దేశాన్ని కార్పొరేట్ మయం చేయడానికి, అప్పుల ఊబిలో ముంచి రాముడికి తలంబ్రాలు, రైతులకు బుల్లెట్లు ఇస్తున్నారన్నారు. ర్యాలీలో పాల్గొన్న అఖిల భారత కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు తోట ఆంజనేయులు, ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను ఆపాలని, కడప స్టీల్ ప్లాంట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, ఎస్‌కే చిన్న జానుసైదా, కోయ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, జక్రం, డేవిడ్, దీనం కొండమ్మ, శివ, దత్తు, నారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గ్రామీణ భారత్ బంద్ ర్యాలీలో పాల్గొన్న ఏఐటీయుసీ నాయకులు, కార్మికులు



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర నాయకులు సాంబశివారెడ్డి తదితరులు

పెదకూరపాడు సీటు కొమ్మాలపాటికే కేటాయించాలి

పెదకూరపాడు, ఫిబ్రవరి 16: పెదకూరపాడు టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కే ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర నాయకులు, సీనియర్ నేతలు ముక్తకంఠంతో తీర్మానించారు. గుంటూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం టీడీపీకి చెందిన నియోజకవర్గ ముఖ్యనేతలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి గుంటూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, టీడీపీ రాష్ట్ర నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, జిల్లా నేతలు పఠాన్ నూర్జహాన్, సీనియర్ నేత, మాజీ ఏపీపీ సరిపూడి నాగేశ్వరరావు, జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వరప్రసాదు, సంగం డెయిరీ మాజీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు, సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కిలారి రాజన్‌బాబులతో పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం కష్టపడిన వ్యక్తి కొమ్మాలపాటి అని అన్నారు. నిత్యం కార్యకర్తలకు అండదండగా ఉంటున్న కొమ్మాలపాటిని కాదంటూ సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ అధినాయకులు పెదకూరపాడు సీటుపై పునరాలోచన చేసి కొమ్మాలపాటికే ఇవ్వాలని తీర్మానం చేశారు. శ్రీధర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని చంద్రబాబు నాయుడుకు గిఫ్ట్‌గా ఇస్తామన్నారు. వరుసకు మామ అల్లుళ్ళయిన వారికి టీడీపీ టిక్కెట్ ఇచ్చే ప్రయత్నం చేయటం సరైన పద్ధతి కాదన్నారు. అవసరమైతే శ్రీధర్ కోసం ప్రాణ త్యాగాలు చేస్తామని ప్రకటించారు.

నిరుద్యోగులను నిలువునా ముంచారు

మెగా డీఎస్సీ కోరుతూ అంబటి కార్యాలయం వద్ద ఆందోళన ● యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తల దాడి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 16: నిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం నట్టేట ముంచిందని, దగా డీఎస్సీ కాదని, మెగా డీఎస్సీ కావాలని కోరుతూ యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శుక్రవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని మంత్రి అంబటి రాంబాబు కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ డౌన్ డౌన్, మంత్రి అంబటి డౌన్ డౌన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. 25వేల పోస్టులతో మెగా డీఎస్సీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో మంత్రి అంబటి కార్యాలయంలో ఉండటంతో లోపలికి యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు వెళ్ళకుండా పోలీసులు అడ్డుకున్నారు. వైసీపీ కార్యకర్తలు కూడా పోలీసులకు మద్దతుగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను తోసివేసి కొంతమంది వైసీపీ కార్యకర్తలు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను కాళ్ళతో తన్నుతూ అనుచితంగా ప్రవర్తించారు. యూత్ కాంగ్రెస్ నేతలను, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. వైసీపీ కార్యాలయం వద్ద పట్టణ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. డౌన్ డౌన్ షర్మిల, డౌన్ డౌన్ కాంగ్రెస్ అంటూ వైసీపీ కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. వైసీపీ కార్యకర్తల దాడిలో యూత్ కాంగ్రెస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఘంటా గోపీ గాయ పడటంతో పోలీసులు చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె పవన్ తేజ, ప్రధాన కార్యదర్శి ఎన్ సుశీల్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పీ సందీప్, ఈశ్వర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి నిరుద్యోగ యువత గుణపాఠం చెప్పటం ఖాయమని ఆయన హెచ్చరించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నేతలు చుక్కా చంద్రపాల్, దాసరి జ్ఞానరాజ్‌పాల్, పలువురు యూత్ కాంగ్రెస్ నేతలు ఉన్నారు.



మంత్రి అంబటి కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ ఆందోళన

వైసీపీ హత్యా రాజకీయాలు మానుకోవాలి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 16: అధికార వైసీపీ హత్యా రాజకీయాలకు తక్షణం అడ్డుకట్ట వేయాలని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. మరీ ముఖ్యంగా పల్నాడు జిల్లాలో విపక్షాలకు చెందిన నాయకులను, కార్యకర్తలను వెంటాడి దాడులు, హత్యలు చేస్తున్న రక్తచరిత్రకు వైసీపీ వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టాలన్నారు. గురువారం రాత్రి దుర్గిలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి అత్యంత హేయమైన చర్యగా ఆయన ఖండించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్షాల్లో భయోత్పాతం సృష్టించటమే లక్ష్యంగా ఇలాంటి చర్యలకు పల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇచ్చి పల్నాడు ప్రశాంత ప్రాంతంగా తీర్చిదిద్దితే వైసీపీ గడిచిన ఐదు సంవత్సరాల్లో తమ స్వార్థ రాజకీయాల కోసం మళ్ళీ కక్షలు, కార్పణ్యాలు రేపి వాతావరణాన్ని కలుషితం చేస్తుందన్నారు. వారికి కొమ్ము కాసే అధికారులంతా మరో రెండు నెలల్లో ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏంటో ఒక్కసారి ఆలోచించు కోవాలని ప్రత్తిపాటి హెచ్చరించారు. ముఖ్యంగా పోలీసులు, వైసీపీ పెద్దలు చెప్పినట్లల్లా ఆడటం కాకుండా ప్రజల ధన, మాన, ప్రాణాలు కాపాడే విషయంలో శ్రద్ధ వహించాలని సూచించారు.

రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్‌లో వణుకు

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 16: రాజధాని ఫైల్స్ సినిమాతో సీఎం జగన్ వెన్నులో వణుకు పుడుతోందని గురజాల మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్క సినిమా చూసి ముఖ్యమంత్రి భయపడటం ఇదే తొలిసారి అని, రైతుల బతుకుచిత్రంపై తీసిన సినిమాను అడ్డుకునే నీచస్థితికి జగన్ ప్రభుత్వం దిగజారిందన్నారు. ఈ సినిమా ద్వారా ప్రజల్లో మరింత వ్యతిరేకత వస్తుందన్న నెపంతో వైసీపీ నేతలు కోర్టుకు వెళ్లారన్నారు. ప్రాంతాల పేరుతో ప్రజలను విడగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న జగన్‌ను రాష్ట్ర ప్రజలు ఇంటికి పంపేందుకు సంసిద్ధంగా వున్నారన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఆనాడు అమరావతికి మద్దతు తెలిపిన జగన్ అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో మాటమార్చి మడమ తిప్పని నేతగా గుర్తింపు పొందాడన్నారు. నిన్నటి దాకా మూడు రాజధానుల పాట పాడిన వైసీపీ నేడు అమరావతి ఉమ్మడి రాజధాని అంటూ కొత్తపల్లవి అందుకుందన్నారు. పక్క రాష్ట్రాల దగ్గర రాజధాని కావాలని అడుక్కునే దీనస్థితికి ఏపీని దిగజార్చారన్నారు. ఐదేళ్లలో దోచుకోవడం... దాచుకోవడం తప్ప జగన్ రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏమీలేదని, రాజధానిలేని రాష్ట్రంగా నిలిపిన ఘనత జగన్‌దేనని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు.

రావాల్సిన బకాయిలే అడుగుతున్నాం : ఏపీ జేఏసీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి16: మీరిచ్చిన హామీలు అడగడం లేదని... కేవలం ఐదేళ్ళ నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన రూ.23,500 కోట్ల బకాయిలు మాత్రమే అడుగుతున్నామని ఏపీ జేఏసీ అధ్యక్షులడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా శుక్ర వారం జెడ్పీ ప్రాంగణంలో ఉద్యోగులు భోజనం విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో పాల్గొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రభుత్వం నిరంకుశ వైఖరి విడనాడి తక్షణం ఉద్యోగులకు రావలసిన బకాయిలను చెల్లించాలని తెలిపారు. జిల్లా కన్వీనర్ శెట్టిపల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ రద్దుచేసి ఉద్యోగులు అందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. నిరసనల్లో భాగంగా శనివారం జరిగే తాలుకా స్థాయి ర్యాలీ, ధర్నాలో ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిరసనల్లో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, వీఆర్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు పూర్ణచంద్రారెడ్డి, బండి శ్రీనివాసరావు, మోహన్‌రావు పెన్షనర్స్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రభుదాస్, ఉపాధ్యాయ సంఘ నేతలు బసవలింగారావు, వేలంగిణి రాజు, మహిళా విభాగం జిల్లా ఛైర్మన్ రాధా రాణి తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.42 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

కోర్టు ఆదేశాలతో ఇసుక దందా గుట్టు రట్టు : కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 16: రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయటాన్ని బట్టి రాష్ట్రంలో ఇసుక అక్రమ దందా జరుగుతుంది నిజమేనని స్పష్టమవుతోందని సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇసుక పాలసీ, ధరల నిర్ణయం గురించి హైకోర్టు నివేదిక కోరిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇసుక పాలసీ సీఎం తమ్ముడికి, పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి మేనల్లుడికి లబ్ధి చేకూర్చేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. పర్యావరణానికి ముప్పు కలిగించేలా పెద్ద పెద్ద యంత్రాలతో ఇసుక ర్యాంపుల్లో ఇసుక తవ్వారని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వమే ఈ అక్రమాలకు పాల్పడిందని, సమస్యలు వచ్చినప్పుడు అధికారులను బలి చేస్తున్నారన్నారు. సీఎం జగన్ అక్రమాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మూడు వారాల్లో నివేదిక ఇవ్వాలని హైకోర్టు కోరిందని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వారంలోపే వివరణ ఇచ్చి తమ చిత్తశుద్ధిని నిరూపించు కోవాలని సూచించారు. ఇసుక అక్రమాలను వెలికి తీస్తున్న అమరావతి విలేకరిపై వైసీపీ నేతలు దాడి చేయటాన్ని ఆయన ఖండించారు. దాడి చేసిన వారిపై చట్టపరంగా కేసు నమోదు చేసి విలేకరికి రక్షణ కల్పించాలని కన్నా డిమాండ్ చేశారు.

'రాజధాని ఫైల్స్'తో జగన్ వెన్నులో వణుకు..

రాజధాని ఫైల్స్ సినిమాతో సీఎం జగన్ వెన్నులో వణుకు మొదలైందని టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల బతుకు చిత్రంపై తీసిన సినిమాను అడ్డుకునే నిచ స్థితికి జగన్ ప్రభుత్వం దిగజరిదన్నారు. సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే జగన్‌కు వచ్చిన నష్టం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ సినిమా ద్వారా ప్రజల్లో మరింత వ్యతిరేకత వస్తుందనే భయంతో వైసీపీ నేతలు కోర్టుకు ఆశ్రయించారన్నారు. 34 వేల మంది రైతుల త్యాగాలకు వాస్తవ రూపంగా రాజధాని ఫైల్స్ సినిమా నిలిచిందన్నారు. ఈ ఐదేళ్లలో దోచుకోవటం దాచుకోవటం తప్ప జగన్‌రెడ్డి చేసిదేమిలేదన్నారు. రాజధాని లేని రాష్టంగా ఏపీని నిలబెట్టిన ఘనత జగన్‌కే దక్కుతున్నారు.

పార్టీ సమన్వయకర్తే అధికారులకు బాస్!

● పార్టీ కార్యాలయానికి వెళ్లి మరీ చెక్కులు పంపిణీ చేయించిన అధికారులు



చెక్కులు పంపిణీ చేస్తున్న బలసాని, అధికారులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 16: వైసీపీ సమన్వయకర్తనే అధికారులు ఎమ్మెల్యేగా బావిస్తున్నారు. సమన్వయకర్తకే సలాం అంటూ రెడ్‌కార్పెట్ పరుస్తున్నారు. ఏకంగా పార్టీ కార్యాలయానికే తరలి వెలుతున్నారు. ఇటీవల పోలీస్ డిపార్ట్‌మెంట్ వైసీపీ కార్యాలయానికి వెళ్లి ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్‌ను కలిసి వచ్చిన విషయంపై ప్రత్తిపాడు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి రామాంజనేయులు ఎలక్షన్ కమీషన్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. అయినప్పటికీ ఏ మాత్రం బెదురు లేకుండా ప్రత్తిపాడు ఆర్ఐ, వీఆర్వోలు వైసీపీకి చెందిన బలసాని కిరణ్ కుమార్ పార్టీ కార్యాలయానికి వెళ్లి మరీ ఆయన చేత ప్రమాద బాదిత కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేయించారు. ప్రత్తిపాడు తహసీల్దార్ ఆదేశాలతోనే వారు అక్కడికి వెళ్లినట్టు తెలుస్తోంది.

రాజ్యాంగ విరుద్ధం

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అధికారులు రాజకీయ పార్టీ కార్యాలయాలకు వెళ్లడం రాజ్యాంగ విరుద్ధమని ప్రత్తిపాడు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఐఏఎస్ అధికారి బి.రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడు వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కు చెందిన పార్టీ కార్యాలయానికి అధికారులు వెళ్లడాన్ని ఆయన తప్పు బట్టారు. ఇప్పటికే ఎన్నికల కమీషన్‌తో ఈ విషయాలలో పోరాటం చేస్తున్నామన్నారు.

మంగళగిరిలో గజదొంగ, చిల్లర దొంగ కలిసి దోపిడీ : పంచుమర్తి

మంగళగిరి, ఫిబ్రవరి 16: మంగళగిరిని దోపిడీ కేంద్రంగా మార్చేందుకు ఏ2 విజయసాయిరెడ్డి మరో చిల్లర దొంగ చిరంజీవిని వెంటేసుకుని దోపిడీకి పాల్పడుతున్నారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఆరోపించారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. చిల్లర రాజకీయాలు చేసే గంజి చిరంజీవిని, ఎన్నికలప్పుడు మాత్రమే కనిపించే కాంద్రు కమలను ప్రజలు ఆదరించే పరిస్థితి ఎంతమాత్రం లేదన్నారు. విశాఖను రాజధాని అంటూ అక్కడ వేలాది ఎకరాల భూముల్ని గజదొంగ జగన్‌రెడ్డి, ముసలి దొంగ విజయసాయిరెడ్డి కొల్లగొట్టారని.. ఇప్పుడు మంగళగిరిలోని దేవాదాయ భూములు, పేదల భూములపై కన్నేశారని ఆరోపించారు.

గుండిమెడ, పెదకొండూరులో ఇసుకను అక్రమంగా బొక్కేస్తున్నారని మండిపడ్డారు. తాజాగా మరో నారీశిరోమణి మంగళగిరి టిక్కెట్ తనదేనంటూ హడావిడి చేయడం విడ్డూరంగా వుందన్నారు. పదవిలో వున్నప్పుడు తప్ప నియోజకవర్గ ప్రజల సమస్యలు, కనీసం తన వీధిలోని ప్రజల సమస్యలను ఆమె ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. పదవి పైసలు ముడితే తప్ప ప్రజల్లోకి రాని ఆమె లోకల్, నాన్‌లోకల్ అంటూ మాట్లాడడం హాస్యాస్పదంగా వుందన్నారు.

మంగళగిరిలో చేనేత కార్మిక సంఘం కార్యాలయాన్ని కూల్చినప్పుడు, ధర్మవరం చేనేతలను విజయవాడలో అర్ధనగ్నంగా కూర్చోపెట్టి దాడి చేసినప్పుడు, చేనేత వ్యక్తి నందం సుబ్బయ్యను వైసీపీ మూకలు రాళ్లతో కొట్టి చంపినప్పుడు వీరంతా ఎక్కడున్నారని ప్రశ్నించారు. అధికార పార్టీ దాహానికి 19 మంది చేనేతలు బలైతే ఒక్క కుటుంబాన్ని అయినా కమల కానీ, చిరంజీవి కానీ పరామర్శించారా అని నిలదీశారు. ఓడిపోయే సీటిచ్చి బీసీలను ఏదో ఉద్ధరిస్తున్నట్టు జగన్‌రెడ్డి బీసీలను అవమానించాడని మండిపడ్డారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా రాబోయే ఎన్నికల్లో నారా లోకేశ్ మంగళగిరి నుంచి భారీ మెజార్టీతో గెలుపొందబోతున్నారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, ఊట్ల దుర్గామల్లేశ్వరీ, కాటాబత్తుని నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆదేశాలున్నా.. బేఖాతరు

● వైకుంఠపురం మల్లాదిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ క్వారీయింగ్
● హైకోర్టు ఆదేశించిన స్పందించని అధికార యత్రాంగం

అమరావతి, ఫిబ్రవరి 16: రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక అక్రమ క్వారీయింగ్, రవాణాను గుర్తించి తక్షణం నిలుపుదల చేయాలని కోర్టు ఆదేశిస్తుంటే అధికార యంత్రాంగం మాత్రం ఎక్కడా ఇసుక అక్రమ క్వారీయింగ్ జరగడం లేదన్నట్లు నటిస్తున్నారు. దీంతో ఇసుక అక్రమార్కులు రాత్రి పగలు అనే తేడా లేకుండా యథేచ్ఛగా నదీ గర్భంలో భారీ ఎక్స్‌వేటర్లు, డెడ్జర్లతో ఇసుక తవ్వకాలు జరిపి అనధికారికంగా అమ్మకాలు జరుపుతున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ మల్లాది, కోనూరు ఇసుక రీచ్‌లను సందర్శించి మైనింగ్ అధికారుల సమాచారం మేరకు అక్రమ క్వారీయింగ్ జరగడం లేదని, అలా జరిగితే మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కోనూరులో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పొల్యూషన్‌కు సంబంధించి రెండు పర్మీషన్‌లు రావాల్సి ఉందని అప్పటివరకు ఇసుక రీచ్‌లలో తవ్వకాలు జరపకూడదని చెప్పారు. కలెక్టర్ రీచ్‌లు సందర్శిస్తున్నారనే ముందస్తు సమాచారంతో వైకుంఠపురం, మల్లాది, కోనూరు రీచ్‌లలో ఇసుక క్వారీయింగ్ నిలుపుదల చేసి ఎక్స్‌వేటర్‌లను పక్కకు తరలించి దాచిపెట్టారు. కలెక్టర్ వచ్చి వెళ్లిన 15గంటల్లో ఇసుక అక్రమార్కులు యథాస్థితిని కొనసాగించి ఇసుకను క్వారీయింగ్ చేసి తరలిస్తూనే ఉన్నారు. ఈ విషయమై బుధవారం కవర్ చేసేందుకు వెళ్లిన ఓ విలేకరిపై మల్లాది రీచ్‌లో దాడిచేయడం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి నామమాత్రం కేసు నమోదుచేసి పోలీసులు చేతులు దులుపుకొన్నారు. ఈ వార్త రాష్ట్రవ్యాప్తంగా సంచలనం అయినప్పటికీ ఇసుక అక్రమ రవాణా ఆగలేదు. బుధవారం హైకోర్టు ఇసుక అక్రమ క్వారీయింగ్‌ను జిల్లా కలెక్టర్లు, మైనింగ్ అధికారులు నిలుపుదల చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినప్పటికీ ఇసుకరీచ్‌లవైపు ఏ అధికారి కన్నెత్తి చూడలేదు. శుక్రవారం కూడా వైకుంఠపురం, మల్లాది రీచ్‌లలో ఇసుక క్వారీయింగ్ జరిగి వందలసంఖ్యలో వాహనాల్లో ఓవర్ లోడుతో ఇసుక బయటకు తరలిపోతోంది. ఏమి జరిగినా దిగువస్థాయి అధికారులను బాధ్యులను చేయవచ్చులే అన్న ధీమాతో జిల్లా యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది.

రాష్ట్ర భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టిన సీఎం

● 1522వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 16: అమ్మలాంటి అమరావతిని నిర్వీర్యం చేసి, మూడు రాజధానుల ప్రతిపాదనను పెట్టి సీఎం జగన్‌రెడ్డి రాష్ట్ర భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టారని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు అన్నారు. మూడు రాజధానులు వద్దు, బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1522వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ ఒక రాష్ట్ర రాజధానిని ఆ ప్రభుత్వమే నిర్వీర్యం చేయటమనేది ప్రపంచ చరిత్రలోనే ప్రప్రథమం అన్నారు. రాజ్యాంగంలో లేని మూడు రాజధానుల ప్రతిపాదన సీఎం జగన్‌రెడ్డి పెట్టటం అధికార అహంకారమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి అమరావతి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. రైతు కూలీలు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే అమరావతి జీవన భృతి పింఛన్‌ను ఐదు వేలు ఇస్తామని చెప్పి ఐదేళ్ల కాలం వెల్లబుచారన్నారు. ఎన్నికలు నెల ఉండగా పేదల పింఛన్‌ఐదు వేలు పెంచుతామని సీఎం జగన్‌రెడ్డి చెప్పటం ఎన్నికల స్టంటేనన్నారు. రాజధాని నిర్మాణ పనులు నిలిపివేసి ఉపాధి లేకుండా చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.



బిల్డ్ అమరావతి అంటూ తుళ్ళూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు



నారాలోకేశ్‌ను కలిసిన సిమ్స్ డైరెక్టర్ భరత్‌రెడ్డి

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను 'సిమ్స్' విద్యాసంస్థల డైరెక్టర్ బీమనాథం భరత్‌రెడ్డి గురువారం కలిశారు. యువనేత చేపట్టిన శంఖారావం యాత్ర విజయనగరం చేరుకున్న సందర్భంగా బొబ్బిలి మాజీ శాసన సభ్యుడు బేబీనాయనతోపాటు ఆయన లోకేశ్‌ను కలిసి శంఖారావానికి మద్దతు తెలిపారు.

కౌన్సిలర్ మదార్‌సాహెబ్ వైసీపీకి రాజీనామా

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 16: వైసీపీలో సామాజిక న్యాయం లేదు.. కులాల మధ్య చిచ్చుపెడుతున్నారు.. అందుకే వైసీపీకి రాజీనామా చేస్తున్నానని మాచర్ల 27వ వార్డు కౌన్సిలర్ మదార్‌సాహెబ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ విధానాలు నచ్చక రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తనతోపాటు తన సామాజిక వర్గానికి చెందిన వారు అధిక సంఖ్యలో పార్టీని వీడనున్నామన్నారు. శనివారం మాచర్ల పట్టణంలో జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో తన సామాజిక వర్గ వైసీపీ నేతలతో కలిసి టీడీపీలో చేరనున్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



విలేకరులతో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

బీసీల రక్తంతో ఎమ్మెల్యేకు బర్త్‌డే గిఫ్టా..

● రిటర్న్ గిఫ్ట్ ఏంటో మేమూ చూపిస్తాం..
● ఎమ్మెల్యే పీఆర్కేకు, అనిల్‌కు ప్రజలు బుల్లెట్లు దింపుతారు
● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 16: బీసీల రక్తంతో ఎమ్మెల్యే పీఆర్కేకు బర్త్‌డే గిఫ్ట్ అంటూ వైసీపీ నేతలు తమాషాలు పడుతున్నారు.. గిఫ్ట్ ఏంటో రిటర్న్ గిఫ్ట్ ఏంటో చూపిస్తాం అని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారమిస్తే అభివృద్ధి చూపాలన్నారు. మీసాలు మెలేయడం, తొడలు కొట్టడం వంటి అనిల్‌కుమార్ యాదవ్ ప్రసంగాలు చప్పట్లకే పనికొస్తాయని ఎద్దేవా చేశారు. ఎప్పుడు వచ్చాం కాదు బుల్లెట్టు దిగిందా లేదా అంటున్నారు.. నీకు, మీ ఎమ్మెల్యే పీఆర్కేకు పల్నాటి ప్రజలు బుల్లెట్లు దింపుతారని అన్నారు. దుర్గిలో బీసీలపై దాడిలో కేసు తీవ్రత తగ్గించేందుకు బాధిత అమాయకునితో పోలీసులు వేలి ముద్రలు వేయించారన్నారు. దాడి చేసిన వ్యక్తులు దుర్గిలో స్వేచ్ఛగా తిరుగుతున్నారు.. శుక్రవారం ఉదయ సెంటర్‌కు కూడా వచ్చి టీ కూడా తాగి వెళ్లారు.. పోలీసులు మాత్రం నిందితులు కోసం గాలిస్తున్నారని చెబుతున్నారని బ్రహ్మారెడ్డి మండిపడ్డారు. రాజధాని ఫైల్స్ సినిమా చూసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వణుకు పుట్టిందన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్టీఆర్ టీడీపీ పార్టీని స్థాపించారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. ఆయన బాటలోనే చంద్రబాబునాయుడు నడుస్తూ వచ్చారని, ఇకపై లోకేష్‌బాబు కూడా అదే బాటలో నడుస్తారని అన్నారు. బ్రహ్మారెడ్డి వెంట యెనుముల కేశవరెడ్డి, మున్నా రాంబాబు, సాతులూరి కుమార్, కొమెర దుర్గారావు, నేరేటి వీరాస్వామి యాదవ్, రాజబోయిన మధు, గుండాల శ్రీనివాసరావు, పసుపులేటి బ్రహ్మనాయుడు, పంగులూరి అంజయ్య, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

రాజధాని ఫైల్స్‌తో జగన్‌రెడ్డి వెన్నులో వణుకు

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, ఫిబ్రవరి 16 : రాజధాని ఫైల్స్ సినిమాతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెన్నులో ఒణుకు పుడుతుందని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సినిమాను చూసి సీఎం భయ పడటం ఇదే తొలిసారి అని, రైతుల బ్రతుకు చిత్రంపై తీసిన సినిమాను అడ్డుకొనే నీచస్థితికి జగన్ ప్రభుత్వం దిగజారిందన్నారు. సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే జగన్‌రెడ్డికి వచ్చిన నష్టమేంటని?, ఈ సినిమా ద్వారా ప్రజల్లో మరింత వ్యతిరేక వస్తుందనే భయంతో వైసీపీ కోర్టుకు వెళ్ళిందన్నారు. 34వేల మంది రైతుల త్యాగాలకు వాస్తవ రూపంగా నిలిచిన సినిమా రాజధాని ఫైల్స్ అని వివరించారు. నిన్నటి వరకు మూడు రాజధానుల పాటపాడిన వైసీపీ నేడు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అని అంటుందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని నిలబెట్టిన ఘనత జగన్‌రెడ్డి దేనని, ఐదు సంవత్సరాల్లో దోచుకోవటం, దాచు కోవటం తప్పా జగన్‌రెడ్డి చేసిందేమి లేదని కొమ్మాలపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

నకరికల్లు, ఫిబ్రవరి 16 : అద్దంకి - నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవరు మృతి చెందాడు. అద్దంకి - నార్కెట్ పల్లి జాతీయ రహదారి అడ్డ రోడ్డు వద్ద లారీని ఎలాంటి సిగ్నల్ లేకుండా రోడ్డుపై నిలిపి ఉంచడంతో, గమనించని వెనుక వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. నకరికల్లు ఎస్ఐ పీ.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్ర రెండవ రహదారి పై టీఎస్ 5యూఎఫ్1092 నెంబరు గల లారీని నడుపుతున్న డ్రైవర్ ఎలాంటి సిగ్నల్స్ లేకుండా నిర్లక్ష్యంగా రోడ్డు పై నిలిపి వేశాడు. అదే సమయంలో చెన్నై వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఏపీ27టీవై 0558 నెంబరు లారీని నడుపుతున్న మర్రిపల్లి రాజు(28) ముందున్న లారీని ఢీకొట్టగా రాజుకు చాతి, కాళ్ళ వద్ద తీవ్రంగా గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. లారీలో రాజు పక్కనవున్న క్లీనర్ జెల్లిపల్లి సాగర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ పీ.రాంబాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి వివాహం కాలేదు. రాజు స్వస్థలం తెలంగాణా రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా చిమలకొండూరు.

నకరికల్లులో ప్రజా సంఘాల ప్రదర్శన

నకరికల్లు, ఫిబ్రవరి 16 : కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను వెంటనే విడనాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం నకరికల్లులో వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా చేపట్టిన గ్రామీణ బంద్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముప్పాళ్ళ: మండలంలోని మాదలలో గ్రామీణబందు, పారిశ్రామిక సమ్మెలో భాగంగా నరసరావు పేట, సత్తెనపల్లి ప్రధాన రహదారిలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ. కృష్ణయ్య, ప్రజాసంఘాల నాయకులు పలువురు పాల్గొన్నారు.

మాచవరం ఎంపీడీవోగా సురేష్

మాచవరం, ఫిబ్రవరి 16: మాచవరం మండల నూతన ఎంపిడిఓగా బి సురేష్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ప్రకాశంజిల్లా నుండి బదిలీపై మాచవరం ఎంపిడిఓగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో వరప్రసాద్ బదిలీపై ప్రకాశంజిల్లా వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు నూతన ఎంపిడిఓను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.



టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును ఉండవల్లిలోని ఆయన గృహంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి కనుమూరి బాజీచౌదరి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. సత్తెనపల్లి నియోజక వర్గంలో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ గెలుపుకోసం చేపడుతున్న కార్య క్రమాలను చంద్రబాబుకు వివరించినట్టు బాజీచౌదరి తెలిపారు. - సత్తెనపల్లి

ఇటు దూకుడు.. అటు అనిశ్చితి !



గురజాల నియోజకవర్గం మ్యాప్

● ప్రజల మధ్యన నిత్య కార్యక్రమాలతో యరపతినేని
● పార్టీ క్యాడర్‌ను నిలుపుకునే పనిలో కాసు
● గురజాలలో వేడెక్కిన ఎన్నికల రాజకీయం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 16: రాష్ట్రంలో ఎన్నికల పోరు రాకముందే గురజాల నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. టీడీపీ అన్నింటా దూకుడు పెంచి రెట్టింపు ఉత్సాహం కనబరుస్తుంది. కొత్తవారి చేరికలు ఇటీవల ఎక్కువ కావడంతో పాటు జనసేన పార్టీ కలయికతో టీడీపీ మరింత బలం పుంజుకుంది. అధికార పక్షం నేతల్లో కొంత అలజడి, అసంతృప్తి, అలకల బుజ్జగింపులతో సరిపోతుంది. గ్రామ, పట్టణ స్థాయి నాయకులు ఎప్పుడు వైసీపీ వీడి టీడీపీ పంచన చేరతారో అన్న ఉత్కంఠ గురజాలలోని వైసీపీ శ్రేణుల్లో వుంది.

ఇటు యరపతినేని శ్రీనివాసరావు, అటు కాసు మహేష్‌రెడ్డి మధ్యే గురజాల నియోజకవర్గంలో పోటీ జరుగనున్నది. ఇప్పటికే టీడీపీ నేత యరపతినేని శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు గ్రామ గ్రామాన పర్యటిస్తూ బాబు ష్యూరిటీ -భవిష్యత్‌కు గ్యారంటీ, పల్లెనిద్ర, ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అధికార పార్టీ ముఖ్యనేత మాత్రం పార్టీలో వున్న వారిని పోగొట్టుకోకుండా వుండేందుకు శత విధాల ప్రయత్నిస్తున్నారు. నిన్నటి వరకు అనేక పదవులు అనుభవించడంతో పాటు కాంట్రాక్టర్లు పొందటం వంటివి చేసిన వారు వైసీపీ ముఖ్యనేత తీరుతో మెల్లమెల్లగా పార్టీకి దూరమవుతూనే వున్నారు.

యరపతినేని ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గంలో ఇప్పటికే జయహో బీసీ, మైనారిటీల ఆత్మీయసదస్సు, దళిత తేజం, గిరిజన సదస్సులతో పాటు ప్రతిరోజు ఏదో ఒక కార్యక్రమంతో యరపతినేని ప్రజలకు చేరువవుతూనే వున్నారు. ఇదిలా వుంటే వైసీపీలో కాసు, జంగా మధ్య విబేదాలు తీవ్రస్థాయికి చేరుకోవడంతో వైసీపీని వీడేందుకు జంగా సంసిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. వైసీపీ ప్రభుత్వ తీరుపై ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతో పాటు అన్ని సామాజికవర్గాలు తీవ్ర అసంతృప్తికి గురవుతూన్న నేపథ్యంలో ఈసారి గురజాలలో సైకిల్ స్పీడ్ పెంచేందుకు శతవిధాల ప్రయత్నిస్తూనే వున్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు చేరికతోపాటు జంగా అసంతృప్తులతో, సీఎం సామాజిక వర్గనేతలు, వ్యాపార వర్గాలవారు కొందరు యరపతినేనితో టచ్‌లో వున్నారు. వైసీపీలో చేరికలు పెద్దగా లేకపోవడంతో పాటు మెజారిటీ సామాజిక వర్గాల మద్దతు కూడగట్టడంలో ముఖ్యనేత విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. లావు, జంగా చేరికలతో టీడీపీ గురజాల నియోజకవర్గంలో మరింత గ్రాఫ్ పెరిగే అవకాశం లేకపో లేదు. అంతేకాకుండా ఇటీవల చంద్రబాబు కూడా గురజాలలో ఈసారి తప్పకుండా గెలిచి తీరుతామని, అన్ని సర్వేలు వెల్లడిస్తున్నాయన్న మాటలు పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది.

పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 16: పెన్షనర్లు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నందా నరసింహయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేసన్ హాలు వద్ద శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రతినెలా 1వ తేదీన పెన్షనర్లకు పెన్షన్ జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ గాదె రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శ నాగేశ్వరరావు, ట్రెజరర్ గాలీబు, హరినాథ్, గోవిందచారి, గౌస్‌మొహిద్దీన్, మస్తాన్‌రావు, వెంకటేశ్వర్లు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య నేత గుండా హఠాన్మరణం

రెంటచింతల,ఫిబ్రవరి 16 ప్రముఖ ఆర్యవైశ్య నేత శ్రీరామకృష్ణా సేవా మండలి, శ్రీరామకృష్ణా గురుకులం, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయాలకు అధ్యక్షులుగా వ్యవహరించిన గుండా వెంకటేశ్వర్లు(74) శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈయనకు భార్య సుబ్బమ్మ, నలుగురు సంతానం. శ్రీ వాసవి ఆలయ చైర్మన్ కేవీ నాగేశ్వరరావు, వైఆర్ఎస్ హైస్కూల్ కరస్పాండెంట్ వైవీ సైదయ్య, ఏచూరి కొండలు, నాళం సోదరులు తదితరులు వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 16: నార్కెట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల నాన్ ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పల్నాడు ఒయాసిస్‌లో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ నిర్వహించారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా 31 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 53 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు పై చదువుల కోసం ఒక్కొక్కరికి రూ.10 వేల స్కాలర్‌షిప్‌లను పట్టణ సీఐ వీరాంజనేయులు, క్యూబ్ హైవేస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనూజ్ మైత్రి, నర్సింగ్, ప్రసాద్, ముకేష్, రాము, ప్రవీణ్, సత్యనారాయణ, నాగార్జున, చిరంజీవి తదితరులు పాల్గొని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రబ్బాని, హెచ్ఎంలు ధనలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

కుల దూషణపై ఎస్సీ, ఎస్టీ కేసు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 16: పాతగణేశునిపాడు గ్రామానికి చెందిన మేకల సురేష్‌పై పిడుగురాళ్ల పోలీసులు ఎస్సీఎస్టీ చట్టం మేరకు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేకల సురేష్, పిడుగురాళ్లకు చెందిన ఎస్సీ సామాజికవర్గానికి చెందిన చెడపొంగు అరుణను కులంపేరుతో తిట్టి, దౌర్జన్యం చేసినట్లు అరుణ ఫిర్యాదు చేసింది. అరుణ వైసీపీ సోషల్ మీడియా విభాగంలో కో-కన్వీనర్‌గా పనిచేస్తుంది. సురేష్ కొన్ని రోజుల నుంచి స్థానిక ఎమ్మెల్యేను కించపరిచేలా ఫేస్‌బుక్‌లో పోస్టులు పెడుతుండటంతో అరుణతో పాటు మరికొందరు ఆ పోస్టులను ఖండిస్తున్న విషయాన్ని మనసులో పెట్టుకున్న సురేష్ గురువారం సాయంత్రం అరుణ వద్దకు వెళ్లి దౌర్జన్యంచేసి కులం పేరుతో తిట్టి అవమానపరిచినట్లు అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సత్తెనపల్లిలో కన్నా నాగరాజు పర్యటన

సత్తెనపల్లి ఫిబ్రవరి 16: గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు శుక్రవారం సాయంత్రం పట్టణంలోని 19,2124 వార్డులలో పర్యటించారు. 19,24 వార్డులలో జరిగిన భావణారుషి స్వామి కళ్యాణసేవలలో ఆయన పాల్గొని పూజలు చేశారు, 21 వార్డు చర్చిలో ప్రార్థనలు చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న టీడీపి నేత పొట్టి హనుమంతురావును పరామర్శించారు. ఆయనవెంట టీడీపి నేతలు కార్యకర్తలు ఉన్నారు.

బీసీల ద్రోహి అనిల్‌కుమార్ యాదవ్

కారంపూడి, ఫిబ్రవరి 16: వైసీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ బీసీల ద్రోహి అని తెలుగుయువత అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్ అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలపై దాడులు చేస్తుంటే మంత్రిగా ఉండి నోరు మెదపని అనిల్‌కుమార్ యాదవ్ బీసీల ప్రతినిధి ఎలా అవుతారని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే జగన్ ప్రభుత్వం 24 శాతానికి కుదించిందన్నారు. వైసీపీ అరాచకాలతో నష్టపోయిన బీసీ కుటుంబాలకు అనిల్‌కుమార్ యాదవ్ క్షమాపణ చెప్పాలని సురేష్ యాదవ్ డిమాండ్ చేశారు.

భక్తి శ్రద్ధలతో రథసప్తమి పూజలు

అమరావతి, ఫిబ్రవరి 16: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలోని ఉగ్ర ఏకాంబరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణములో శుక్రవారం గీతా వెంకటేశ్వర కృష్ణయాజుష స్మార్థ పాఠశాల విద్యార్థులచే సూర్య నమస్కారాలు, మహాసౌరయాగం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఘంటసాల చంద్ర మౌళి, మణికంటలు నిర్వహించారు. వైకుంఠపురంలోని వెంకటేశ్వర స్వామి, అమరేశ్వరస్వామి ఆలయాల్లోనూ భక్తులు సూర్య భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొనసాగుతున్న ఉద్యోగుల నిరసనలు

అమరావతి, ఫిబ్రవరి 16: ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఏపీ ఎన్జీవో అమరావతి యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంవద్ద రెవెన్యూ ఉద్యోగులు, పెన్షనర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎన్జీవో అసోషియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరేపల్లి రాజశేఖర్, పెన్షనర్ల సంఘ నేతలు కోటేశ్వరరావు, తిమ్మయ్య, సూర్యనారాయణ, ఉద్యోగులు మురళీ, ముకుందరావు, వెంకట్రావు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

యువ ఓటర్లు మద్దతు చంద్రబాబుకే..

సత్తెనపల్లి, ఫిబ్రవరి 16 : కొత్త ఓటర్లు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకే మద్దతు ఇస్తున్నారని టీడీపీ నేతలు అన్నారు. టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు శుక్రవారం టీడీపీ ప్రజా వేదికలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఫైఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తుందన్నారు. యువత, కళాశాలల విద్యార్థులు చంద్రబాబును సీఎం చేయడానికి సిద్దంగా ఉన్నారన్నారు. సమావేశంలో తెలుగు యువత నియోజక వర్గ అధ్యక్షుడు రాఘవ యాదవ్, నాయకులు కొండలు, సుమన్, శారదాదేవి, అంబిక తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ, కాపులు, మైనార్టీలు టీడీపీ వైపు ..

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, కాపులు టీడీపీ వైపు ఉన్నారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల వెంకట స్వామి, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల ఆదినారాయణ, నియోజక వర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొక్కా సంగీతరావు అన్నారు. శుక్రవారం టీడీపీ ప్రజా వేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, కాపులుమోసం చేసిన వైఎస్ జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు.

హైస్కూల్‌కు సెలవు ప్రకటించలేదు

కారంపూడి, ఫిబ్రవరి 16: హైస్కూల్‌కు శుక్రవారం సెలవు ప్రకటించలేదని స్థానిక జడ్పీహైస్కూల్ హెచ్ఎం అనంత శివ అన్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'హైస్కూల్‌కు సెలవు ప్రకటించారు' అని వచ్చిన కథనాన్ని ఆయన ఖండించారు. వైసీపీ నేత తన కుటుంబ శుభకార్యాన్ని హైస్కూల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లుచేయగా, దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. పాఠశాలను యథావిధిగా కొనసాగించామని హెచ్ఎం తెలిపారు.

పెట్రోలు బంకులో తనిఖీ

దాచేపల్లి, ఫిబ్రవరి 16: దాచేపల్లిలోని భారత్ పెట్రోలు బంకులో బీపీసీఎల్ ఆఫీసర్ చంద్రకాంత్, సివిల్ సప్లై డీటీ మురళీ, తూనికలు, కొలతల అధికారి అల్లూరయ్యలు శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ఆయిల్ కొట్టే విధానం, కొలతలలో తేడాలు వస్తున్నాయని ఇటీవల కొంత మంది ఖాతాదారులు అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న అధికారులు ఆయిల్ బంకుల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్ విధానాన్ని, ఆయిల్ నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. బంకులోని పెట్రోలు కొట్టే విధానంలో తేడాలు లేవని అధికారులు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడాలి

గురజాలటౌన్, ఫిబ్రవరి 16: గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడాలని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన పార్టీ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని సమస్యలు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ నేతలు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీలో యరపతినేని

రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమే

● బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీలో యరపతినేని

గురజాలటౌన్, ఫిబ్రవరి 16: రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమేని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని మాడుగులలో జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా యరపతినేని మాట్లాడుతూ.. దత్తత తీసుకొని గ్రామాన్ని అభివృద్ధి చేస్తే అధికార పార్టీ నేతలు దౌర్జన్యంతో దోచుకుంటున్నారని మండిపడ్డారు. 2019 ఎన్నికల్లో అలివిగానీ హామీలతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, అప్పటి నుంచి గురజాల నియోజకవర్గంలో విధ్వంసపాలన చేస్తున్నారన్నారు. మాడుగుల గ్రామాన్ని మట్టి, రంగురాళ్ల మాఫియాగా తయారు చేశారన్నారు. 2014-2019 టీడీపీ హయాంలో గ్రామాన్ని తాను దత్తత తీసుకొని గ్రామంలో సోషల్ వెల్ఫేర్ స్కూల్‌తోపాటు సీసీరోడ్లు ఏర్పాటు, బుగ్గవాగు నుంచి తాగునీటి సదుపాయం, కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. గ్రామంలో టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి తప్ప వైసీపీ ఏమైనా అభివృద్ధి చేసిందా అని ప్రశ్నించారు. అభివృద్ధి ఎవరుచేశారో.. అరాచకాలు ఎవరు చేశారో గ్రామస్తులు గమనించాలన్నారు. రానున్న ఎన్నికలకు టీడీపీ, జనసేన నేతలంతా కలిసికట్టుగా సిద్ధం కావాలని, వైసీపీ అరాచకాలను ప్రజలకు వివరించాలన్నారు. వైసీపీ ప్రభుత్వానికి వత్తాసు పలికే పోలీసు అధికారులు రానున్న టీడీపీ, జనసేన ప్రభుత్వంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వాన్ని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా గ్రామంలోని ఎపిఫానియా క్రీస్తు లూథరన్ దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ పులుకూరి కాంతారావు, మాజీ జడ్పీటీసీ గనిపల్లి శ్యాం, యాగంటి రామారావు, యేచూరి బ్రహ్మయ్య, చావా రామారావు, మాగంటి సుబ్బయ్య, మాజీ ఎంపీటీసీ శరమాల హనుమంతురావు, నన్నపనేని లక్ష్మయ్య, బత్తుల సైదారావు, నాగరాజు, జనసేన సమన్వయ కార్యకర్త కటికం అంకారావు, జిల్లా కార్యదర్శి బడిదెల శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ఉప్పిడి నరసింహారావు పాల్గొన్నారు.

వైసీపీ అధికారంలోకి వచ్చాక దారుణ మారణకాండ

నరసరావుపేట టౌన్ : దుర్గి మండలం జంగమహేశ్వపాడులో దారుణ మారణకాండ జరిగిందని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జంగమహేశ్వరపాడులో వైసీపీదాడిలో గాయపడి నరసరావుపేట ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు అట్లా చినవెంకటరెడ్డి, యువనాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రమేష్, కొట్టా కిరన్‌కుమార్, క్రాంతి, కార్యకర్తలు ఉన్నారు.

పెదకూరపాడు సీటు కొమ్మాలపాటికే ఇవ్వాలి

● గుంటూరులో పెదకూరపాడు టీడీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశం

బెల్లంకొండ: ఫిబ్రవరి 16: పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మె ల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను ప్రకటించాలని బెల్లంకొండ మండల టీడీపీ ఏకగ్రీవంగా తీర్మానించింది. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల టీడీపీ నేతలు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలోనూ టీడీపీ క్యాడర్‌కు వెన్నంటే ఉండి పనిచేసిన వ్యక్తి కొమ్మాలపాటి శ్రీధర్‌ని, పెదకూరపాడు టిక్కెట్‌ను ఆయనకే ఇవ్వాలని టీడీపీ అధిష్టానాన్ని కోరారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, నేతలు గుడిసె కొండయ్య, సయ్యద్ జబ్బార్, తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేతలు

మంత్రి అంబటి క్షమాపణ చెప్పాలి

● యూత్ కాంగ్రెస్ నేతలపై వైసీపీ గుండాల దాడి గర్హనీయం
● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్

సత్తెనపల్లి, ఫిబ్రవరి16: డీఎస్సీ నోటిఫికేషన్‌ను నిరసిస్తూ మంత్రి అంబటి రాంబాబును కలిసి వినతిపత్రం ఇవ్వటానికి వెళ్లిన యూత్ కాంగ్రెస్ నేతలపై వైసీపీ గుండాలతో దాడి చేయించిన మంత్రి అంబటి రాంబాబు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయనమాట్లాడుతూ.. పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపుమేరకు రాష్ట్ర యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నేతలు రాష్ట్రవ్యాప్తంగా మంత్రులను కలిసి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రాలు అందిస్తున్నారన్నారు. అందులో భాగంగా మంత్రి అంబటి రాంబాబును కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నేతలపై పోలీసుల సమక్షంలో వైసీపీ కార్యకర్తలు దాడి చేయటాన్ని ఆయన ఖండించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, జిల్లా అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్‌లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయంలో మంత్రి అంబటి రాంబాబు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసి పదవులు అలకరించారని, నేడు ఆయన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలపై దాడి చేయించటం తగదన్నారు. ఈ విషయంపై మంత్రి అంబటి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నేతలు చుక్క చంద్రపాల్, దాసరి జ్ఞాన్‌రాజ్ పాల్, పవన్‌తేజ, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాకు గురైన వలస కూలీలు

● సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స
● మెరుగైన చికిత్స కోసం జీజీహెచ్‌కి తరలింపు

సత్తెనపల్లి, ఫిబ్రవరి16: ఫుడ్‌పాయిజ్ అయి ఏడుగురు వలస కూలీలు అస్వస్థతకు గురై సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కర్నాటకలోని రాయచూర్ ప్రాంతానికి చెందిన 30 మంది వలస కూలీలు అచ్చంపేట మండలం పెదపాలెం గ్రామానికి మిరప కాయలు కోతల నిమిత్తం వలస వచ్చారు. వీరిలో రంగనాథ్, తరుణ్, రాజు, తేజ అనే చిన్నారులతో పాటు ఈసప్ప, నాగమ్మ, శ్యామ్ బసవలు గురువారం రాత్రి నుంచి వాంతులు, విరోచనాలతో బాధ పడుతున్నారు. అనారోగ్యం పాలైన ఏడుగురిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. వీరిలో శ్యామ్ బసవను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

భావనారుషిస్వామి కళ్యాణ మహోత్సవం

పెదకూరపాడు, ఫిబ్రవరి 16: మండలంలోని లగడపాడులో భద్రావతి భావనారుషిస్వామివార్ల కళ్యాణ మహోత్సవాన్ని శుక్రవారం మద్దాలి అనీల్‌శాస్త్రి ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పద్మశాలి సంక్షేమ సంఘం, ఆలయ కమిటీ జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘాల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

లారీని ఢీకొన్న కారు.. ఒకరి మృతి

మేడికొండూరు, ఫిబ్రవరి 16: వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి డివైడర్‌పై నుంచి దూసుకువచ్చి ఎదురుగా వస్తున్న మినిలారీని ఢీకొన్న ఘటన మండలంలోని పేరేచర్ల ఆరవ మైలు కాలనీ వద్ద శుక్రవారం జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు అక్కడికక్కడే మరణించగా కారు డ్రైవర్‌కు, మినిలారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సీఐ జయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సత్తెనపల్లి మండలం, గుడిపూడి గ్రామానికి చెందిన షేక్ జానీబాషా (32) తన స్నేహితుని కారులో డ్రైవర్ సులేమాన్‌ను తీసుకొని గుంటూరు బయలుదేరి వస్తుండగా పేరేచర్ల వద్ద కారు అదుపు తప్పి డివైడర్ పై నుంచి రోడ్డుకు రెండవ వైపున ఎదురుగా గుంటూరు నుంచి అచ్చంపేట వైపు వెళుతున్న అశోక్ లేలాండ్ మినిలారీని ఢీకొట్టి పడిపోయింది. ఈ ప్రమాదంలో షేక్ జానిబాషా తలకు తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మరణించాడు. డ్రైవర్ సులేమాన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. లారీడ్రైవర్ నాగేశ్వరరావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు.

18న ఛలో విజయవాడ

క్రోసూరు, ఫిబ్రవరి 16 : పాత పెన్షన్ విధానాన్ని సాధించుకోవటానికి ఈనెల 18న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘ నేతలు తెలిపారు. శుక్రవారం క్రోసూరులో వారు ఛలో విజయవాడ పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిచ్చయ్య, శరత్ కుమార్, చంద్రం, వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నల్లచట్టాలతో శ్రామికవర్గాన్ని మోసం చేసిన ప్రభుత్వం

● దేశ వ్యాప్త గ్రామీణ బంద్‌లో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు ● వివిధ ప్రాంతాల్లో ధర్నాలు, నిరసనలు

దాచేపల్లి, ఫిబ్రవరి 16 నల్లచట్టాలతో దేశంలోని శ్రామిక వర్గాన్ని కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని కార్మిక, రైతు సంఘాల నేతలు మండిపడ్డారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాపిత గ్రామీణ బంద్‌లో భాగంగా శుక్రవారం దాచేపల్లిలో సీపీఐ, కాంగ్రెస్ పార్టీల నేతలు ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కార్మిక చట్టాలను అనేక పోరాటాల ద్వారా సాధించుకున్నారని, వాటిని కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ చట్టాలను తీసుకొచ్చి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కరాల పాటి జాని, సీపీఐ నాయకులు వేముల వెంకటరెడ్డి, బుర్రి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: పిడుగురాళ్లలో కార్మికులు, రైతులు, వామపక్ష నేతలు ర్యాలీ చేసి ధర్నా నిర్వహించారు. పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయం నుండి ఐలాండ్ సెంటర్ వరకు జరిగిన ర్యాలీలో వామపక్ష పార్టీల నేతలు, రైతులు,కార్మికులు పాల్గొన్నారు. రైతు సంఘం నేతలు ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రైతులను, కార్మికులను నట్టేట ముంచిందన్నారు. బ్రిటీష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ రద్దు చేశారన్నారు. కార్యక్రమంలో రాంబాబు,హసన్, తెలగపల్లి శ్రీను, వెంకటేశ్వర్లు, సంపతి వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో ర్యాలీ చేస్తున్న వామపక్ష, కార్మిక సంఘ నేతలు



క్రోసూరులో గ్రామీణ బంద్‌లో సీఐటీయూ నేతలు



దాచేపల్లిలో రాష్ట్ర రహదారిపై ధర్నా

క్రోసూరు : క్రోసూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వందలాది మంది ప్రజా సంఘాల నాయకులు, ఆటో యూనియన్ నాయకులు, భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు, అంగన్‌వాడీ యూనియన్ నేతలు, తాగు నీటి స్కీమ్‌ల ఉద్యోగుల యూనియన్ నాయకులు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.

కారంపూడి: మండల కేంద్రమైన కారంపూడిలో భారత గ్రామీణ బంద్‌లో కార్మికులు, ఆయా సంఘాల నేతలు పాల్గొన్నారు. సీపీఐ మండల కార్యదర్శి షేక్ సైదా మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోడీ అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలను తీసివేశారన్నారు. కార్యక్రమంలో జక్కంపూడి పద్మ, శ్రీనివాసరావు, వెంకటశివయ్య, ఇందూరు శ్రీనివాసరావు, సుభాని, వెంకటేశ్వర్లు, సూరె హనుమంతురావు, తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

వైభవంగా రథసప్తమి వేడుకలు

వినుకొండ, ఫిబ్రవరి 16: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో రథసప్తమి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం గరుడ ఆల్వార్ వాహనంపై స్వామివారిని కోలాటాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రావన్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి బంగారయ్య, అచ్యుత కృష్ణసుబ్బారావు, కాళ్ల రామకోటేశ్వరరావు, కొత్తమాసు పెద్ద రాములు, కాకుమాను రామకోటేశ్వరరావు, అన్న వీరబ్రహ్మం, పుల్లారావు, ఏల్చూరి నారాయణరావు, రూపేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

స్థానిక దక్షిణం బజారులోని భద్రావతి సమేత భావనారుషి దేవస్థానంలో నియోజకవర్గ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణం నిర్వహించారు. మహిళలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఉత్తమ సేవా అవార్డు అందుకున్న పట్టణ సీఐ సాంబశివరావుతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన పద్మశాలి సభ్యులకు, విద్యార్థులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

● రొంపిచర్ల: మండలంలోని విప్పర్లలో వల్లభేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సూర్యనారాయణుడికి రథసప్తమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు చందలూరు పరమేశ్వరరావు స్వామివారికి అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం భజనా కార్యక్రమాలు జరిగాయి.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

● డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 16: రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో ప్రశాంతంగా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవాలని నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఇటీవల నరసరావుపేట డీఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన శుక్రవారం వినుకొండలోని రూరల్, పట్టణ పోలీస్‌స్టేషన్‌లను సందర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. ఇప్పటికే కిందిస్థాయి సిబ్బంది ద్వారా రౌడీషీటర్లను పిలిపించి బైండోవర్ చేస్తున్నామన్నారు. గ్రామాల్లో సారా, మద్యం విక్రయాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ప్రధాన రహదారులపై చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ఎన్నికల విధుల్లో భాగంగా తనిఖీలు చేపట్టడం జరుగుతుందనిన్నారు. గ్రామాల్లో అలజడి సృష్టించేవారి వివరాలను పోలీసులకు చేరవేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఆయనతో పాటు సీఐ సాంబశివరావు, ప్రభాకర్‌తో పాటు ఎస్ఐలు పాల్గొన్నారు.

రేపు సీపీఎస్ ఉద్యోగుల చలో విజయవాడ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 16: ఓపీఎస్ సాధనే లక్ష్యమని సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉబేద్‌బేగ్ అన్నారు. శుక్రవారం చలో విజయవాడ పోస్టర్‌ను పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉబేద్‌బేగ్ మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో వారంలో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఐదేళ్లయినా హామీ నెరవేర్చకపోవటంతో మోసపోయామన్నారు. జిల్లా సెక్రటరీ పోలూరి పిచ్చయ్య మాట్లాడుతూ ఈ మోసాన్ని ఎండగట్టడానికి ఈ నెల 18న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొనాలన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

24 మంది తిరుమల ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 16: స్థానిక జొన్నలగడ్డలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తిరుమల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 24మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వైవీ నారాయణ తెలిపారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ఫేస్‌ప్రెప్ కంపెనీ ప్రతినిధులు శుక్రవారం కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. వివిధ బ్రాంచిల నుంచి 253మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన వారికి వార్షిక వేతనంగా రూ.3,06,000/- అందుకోనున్నారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, కళాశాల ఛైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, వైస్‌ఛైర్మన్ బత్తిన నాగేశ్వరరావు, కోశాధికారి దండా బ్రహ్మానందం, ప్లేస్‌మెంట్ అధికారిని అభినందించారు.

పోలీసు స్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 16: తనపై, తన భార్యపై అక్రమ కేసు బనాయించారంటూ పట్టణ శివారు వెంకటాద్రి కాలనీకి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. వెంకటాద్రి నగర్‌లో తమ కోడి పిల్లలను సమీపంలోని వీధి కుక్కలు తింటుండటంతో తన భార్య వాటిని కర్రతో కొట్టిందన్నారు. దీంతో సమీపంలోని ప్రభుత్వ ఉపాధ్యాయిని శాంతి, మరో మహిళ బుజ్జి తన భార్య అనురాధపై దాడి చేశారన్నారు. ఈ దాడిలో తన భార్యకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. అంతేకాకుండా తన భార్యపై దాడిచేసిన వారు తనపై, తన భార్యపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసు బనాయించారని బాధితుడు రమణారెడ్డి తెలిపారు. బాధితుడు రూరల్ పోలీసు స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకుంటున్న సమయంలో అక్కడే ఉన్న వైసీపీ నేతలు తిరుపతిరెడ్డి తదితరులు వారించి అతన్ని తీసుకువెళ్ళారు. ఈ విషయమై రూరల్ ఎస్ఐ రోశయ్యను వివరణ కోరగా ఈ ఘటనకు తమకు ఎటువంటి సంబంధం లేదని, గురువారం జరిగిన సంఘటపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

నమస్తే పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

● సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు మునిసిపల్ కమిషనర్ సూచన

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 16: భారత ప్రభుత్వం, గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న నమస్తే (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్‌ఎకో సిస్టం) పథకం పైలట్ ప్రాజెక్టును స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించడం జరిగిందని నరసరావుపేట మునిసిపల్ కమిషనర్ రామ్మోహన్ తెలిపారు. మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం నమస్తే పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తు చేసుకునేవారు తమ ఆధార్‌కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు లేదా కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు వివరాలతో మునిసిపల్ కార్యాలయంలో శానిటేషన్ విభాగంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 16: అక్రమంగా 20 మద్యం సీసాలను కలిగి ఉన్న మండలంలోని పమిడిపాడు అగ్రహారానికి చెందిన ఉయ్యాల వాసును అరెస్టు చేసినట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార శుక్రవారం తెలిపారు. నిందితుడు వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని వారు తెలిపారు.

లారీ డ్రైవర్‌కు జైలు, జరిమానా

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి16: ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ఓ వ్యక్తి మృతికి కారకుడైనట్టు నేరం రుజువవ్వటంతో నిందితుడు ప్రకాశం జిల్లా దర్శికి చెందిన రాంబాబుకు ఏడాది జైలు శిక్ష, రూ.1600 జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవల్లిక శుక్రవారం తీర్పు వెలువరించారు. 2015 ఏప్రిల్ 11న మండలంలోని లక్ష్మీపురం గ్రామం వద్ద ఆగి ఉన్న లారీని నిందితుడు లారీతో ఢీకొట్టాడు. ఈ ఘటనలో ప్రకాశం జిల్లా కందుకూరు మండలం కొండమరుసు గ్రామానికి చెందిన కట్టా వెంకయ్య (55) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ లక్ష్మీరామ్ నాయక్ నిర్వహించారు.

బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు



చిలకలూరిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 16: కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పలువురు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక ఐక్య వేదిక ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం ఇక్కడ గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఈ సందర్భంగా పట్టణ ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. కళా మందిర్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సదర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సంపదను కార్పోరేట్ కంపెనీలకు మోడీ ప్రభుత్వం అప్పగిస్తున్నదని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఉపాధి హామీ పథకాన్ని రెండు వందల రోజులకు పెంచి, రోజు వేతనంగా రూ.600 చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు, వివిధ పార్టీలు, సంఘాలకు చెందిన నాగభైరు రామ సుబ్బాయమ్మ, ఎం.రాధాకృష్ణ, వై.రాధాకృష్ణ, చెరుకుపల్లి నిర్మల, రావు సుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలో పలువురి నిరసన

మని ఢిల్లీ వచ్చిన రైతులపైకి సాయుధ దళాలను, పోలీసులను ఉసిగొల్పి బాష్పవాయువులను ప్రయోగించిందన్నారు. చెవుడు వచ్చేలా శబ్దాలు చేయించడంతోపాటు లాఠీలతో చావబాదారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్లపై వస్తున్న రైతులను అడ్డుకునేందుకు రోడ్లకు మేకులు కొట్టి రాళ్ళు, ముళ్ళ కంచెలను అడ్డంగా వేశారన్నారు. సమస్యలను సానుకూలంగా పరిష్కరించాల్సిన ప్రభుత్వం రైతులపై నిర్బంధంగా అణచివేయాలని చూస్తున్నదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడం, కార్పొరేట్ సంస్థలను చిల్లర వర్తకంలోకి అనుమతించి, చిరు వ్యాపారుల పొట్టకొట్టడం చేస్తున్నదన్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాయడం, ప్రశ్నించిన వారిపై దేశద్రోహం నేరంమోపి జైళ్ళకు పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులు, కార్మికులపై అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరిని విడనాడి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకుడు నూతలపాటి కాళిదాసు, కల్లూరి రామారావు, ఎం.పద్మారావు, గోగడ హరిబాబు, ఆలోకం సుబ్బారావు, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కారుచోల రోశయ్య, శ్రీను, కృష్ణ, రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల, ఫిబ్రవరి 16 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండలంలో గ్రామీణ బంద్ కార్యక్రమం జరిగింది. కార్మిక సంఘాలు, సీపీఐ, సీపీఎం, బీసీ, సంక్షేమ సంఘాలు ఈ బంద్‌ను నిర్వహించాయి. పోస్టాఫీసు వద్దకు వెళ్ళి మూసి వేయించారు. ఈ కార్యక్రమంలో సరికొండ వెంకటేశ్వరరాజు, బండారుపల్లి నాగేశ్వరరావు, రామిరెడ్డి, సరికొండ తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

'హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వాలు విఫలం'



శివయ్యస్థూపం సెంటర్‌లో గ్రామీణ బంద్‌లో భాగంగా మానవహారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 16: రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, కార్మికులు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలుపరచాలంటూ జాతీయ రైతు సంఘాల దేశ వ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె పిలుపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని శివయ్యస్థూపం సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతివరప్రసాద్‌తో పాటు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు హనుమంతరెడ్డి కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ 2014లో నరేంద్రమోదీ అధికారంలోకి రాక ముందు రాష్ట్రంలో జరిగిన బహిరంగ సభల్లో ప్రజలకు వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత హామీలు మరచారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా 10 సంవత్సరాలు ఇస్తామని, విశాఖకు రైల్వేజోన్, కడప స్టీల్ ప్లాంట్, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి నేటికి అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని హామీఇచ్చి నేడు రాజధాని లేని రాష్ట్రంగా చేశారన్నారు. నరేంద్రమోదీ మూడు నల్లచట్టాలను వెనక్కితీసుకుంటామన్న హామీని అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరల చట్టం చేయాలి

● కౌలు రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ

యడ్లపాడు, ఫిబ్రవరి 16: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు మద్దతు ధర లభించక అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, దీనిని నివారించేందుకు ప్రభుత్వం పంటలకు మద్దతు ధరలు కల్పిస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని కౌలు రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్తంగా గ్రామీణ భారత్ బంద్‌కు ఇచ్చిన పిలుపుకు మద్దతుగా రైతు, కార్మికసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రమైన యడ్లపాడులో బంద్ నిర్వహించారు. వ్యాపారులు, దుకాణదారులు, హోటళ్ళ యజమానులు స్వచ్ఛందంగా బంద్ పాటించి సమ్మెకు సంఘీభావం తెలిపారు. రైతులు, కార్మికులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించడంతోపాటు బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలను మూసివేయించారు. సాయత్రం వరకు స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌ను జయప్రదం చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిందిపోయి యుద్ధం ప్రకటించిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయ



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ, పక్కన రైతు, కార్మిక సంఘాల నాయకులు

మద్యం తాగొద్దు అన్నందుకు బలవన్మరణం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 16: భార్య మద్యం తాగొద్దని అన్నందుకు అవమానంగా భావించి ఓ వ్యక్తి ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన శుక్రవారం పట్టణంలోని శివసంజీవ కాలనీలో చోటు చేసుకుంది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన యోహాన్ మద్యానికి బానిసై ఏ పని చేయకుండా తిరుగుతుంటాడు. ఈ క్రమంలో అతని భార్య మద్యం తాగొద్దని గట్టిగా చెప్పడంతో సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారన్నారు. మృతునికి ఇరువురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

● నర్సరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ

శావల్యాపురం, ఫిబ్రవరి 16: రానున్న ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గ్రామాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లుచేసి ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని నర్సరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు, పెండింగ్ కేసులు, మండలంలోని గ్రామాల పరిస్థితిని గురించి ఆరా తీశారు. డీఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా గ్రామాలలో ఎటువంటి రాజకీయ వివాదాలకు తావులేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు చేపట్టవలసిన భద్రతా చర్యలను సిద్ధం చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలన్నారు. రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావు, ఎస్ఐ చల్లా సురేష్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 16: ప్రణాళికాబద్ధంగా చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ బూసిరెడ్డి శంకరరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు ప్రారంభించేందుకు వచ్చిన ఆయన వినుకొండలో ఎంఎస్ బ్రదర్స్ ఆర్థికసాయంతో పంపిణీ చేసిన పరీక్షా సామగ్రిని పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు శంకరరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. అదేవిధంగా విఠంరాజుపల్లి గ్రామసమీపంలోని బధిరుల పాఠశాలకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ వినుకొండ అధ్యక్షుడు చిరుమాళ్ల కోటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, పలు విభాగాల్లోని రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

202 మంది వలంటీర్లకు సేవా పురస్కారాలు: ఎంపీడీవో

శావల్యాపురం, ఫిబ్రవరి 16: మండలంలోని 11 సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న గ్రామ వలంటీర్ల పనితీరు ఆధారంగా 202 మంది వలంటీర్లను ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారాలకు ఎంపిక చేసినట్లు ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలో సేవామిత్రలుగా 195మందిని, సేవా రత్నాలుగా ఐదుగురిని, సేవా వజ్రాలుగా ఇద్దరిని ప్రభుత్వం ఎంపిక చేసిందని తెలిపారు. సేవా వజ్రాలుగా కారుమంచి వలంటీర్ ఎలికా నాగేశ్వరరావు, పోట్లూరు వలంటీర్ పోట్లూరి సుకన్యలు ఎంపిక కాగా, సేవారత్నాలుగా వేల్పూరు-2 వలంటీర్ చేవల బ్రహ్మయ్య, పోట్లూరు వలంటీర్ దివ్వకోలు రజనీ, గంటుపాలెం వలంటీర్ మంగమూరి ప్రమీల, కనమర్లపూడి వలంటీర్ దేవరపల్లి శ్రీనివాసరావు, కారుమంచి వలంటీర్ గొడుగులూరి సుజాతలు ఎంపికయ్యారని తెలిపారు. సేవా వజ్రాలకు రూ.45వేలు, సేవా రత్నాలకు రూ.30వేలు, సేవా మిత్రలకు రూ.15వేలు చొప్పున నగదు పురస్కారాలను త్వరలో ఎంపికైన వలంటీర్లకు ప్రభుత్వం అందజేయనుందని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం అన్నదానం

వినుకొండ, ఫిబ్రవరి 16: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం వారి ఆధ్వర్యంలో సంఘం కార్యాలయం వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యుడు భువనగిరి సుబ్రహ్మణ్యం 10 సంవత్సరాలుగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో నారాయణరావు, సరోజని, జి.నాగేంద్రుడు, సామ్రాజ్యలక్ష్మి, సుబ్బయ్యశర్మ, బీపీఎస్ సుందరరావు, వి.హనుమంతరావు, దీక్షితులు, రఘు, మల్లికార్జునశాస్త్రి, ఆదిరాములు, శర్మ, రాఘవయ్య, రాము, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

● జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు

శావల్యాపురం, ఫిబ్రవరి 16: రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణతను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి మేడా వెంకటేశ్వర్లు అన్నారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పది పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 127పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, 30,169మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పదిపరీక్షల ఏర్పాట్లుపై ఈ నెల 20వ తేదీన జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లుపై చర్చించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులను దత్తత చేసుకొని వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వేల్పూరు జడ్పీపాఠశాలలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం లేదని, కారుమంచి జడ్పీపాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుల కొరత ఉందని విలేకరుల డీఈవో దృష్టికి తీసుకెళ్ళగా వెంటనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పది విద్యార్థులకు ప్రభుత్వమందించే పోషకాహారం అందించడం లేదని తెలుపగా త్వరలో ప్రారంభిస్తామన్నారు. పాఠశాలలోని ఆరుగురు విద్యార్థులు జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపికై రాణించడంపై పీడీ రాగుల రాధాకృష్ణమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు. హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, కంప శ్రీనివాసరావు, విమలకుమారి పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు: డీవైఈవో వేణుగోపాలరావు

కొచ్చెర్ల (ఈపూరు) ఫిబ్రవరి 16: విద్యార్థుల బోధనపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని పల్నాడు జిల్లా ఉప విద్యాశాఖాధికారి కే వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని కొచ్చెర్ల హైస్కూల్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో పలు సబ్జెక్టులపై ప్రశ్నలను అడిగి జవాబులు రాబట్టారు. అనంతరం రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు మెరుగు పరుచుకోవలసిన అంశాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

విధి నిర్వహణలో అలక్ష్యం వహిస్తే చర్యలు: ఎంపీడీవో

యడ్లపాడు, ఫిబ్రవరి 16: విధి నిర్వహణలో అలక్ష్యం వహించి ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని ఎంపీడీవో వైశ్రీనివాసరావు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి గ్రామసచివాలయానికి వచ్చిన వినతుల్ని సత్వరమే ఆన్‌లైన్ చేసి సంబంధిత అధికారి లాగిన్‌కు పంపించాలన్నారు. అయితే సచివాలయ ఉద్యోగులు దానిని సక్రమంగా నిర్వహించడం లేదంటూ ప్రజల నుంచి తనకు ఫిర్యాదులు అందాయన్నారు. అంతేగాకుండా జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలోనూ ఫిర్యాదులు వస్తుండడమే అందుకు నిదర్శనమన్నారు. ప్రజలు తమ సమస్యల్ని వివిధ శాఖల సేవలను పొందాలనుకునే వారు నేరుగా తమ అర్జీని తమ సమీప సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌కు అందించాలన్నారు. దానిని సర్వీస్ ఆన్‌లైన్ చేస్తారని, అలా చేయని పక్షంలో తన దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వాలంటీర్లు సైతం వారంలో మూడు రోజులు విధిగా సచివాలయం వద్ద హాజరై బయోమెట్రిక్ వేయాలన్నారు. ఇకపై తాను తరచూ సచివాలయాలను సందర్శిస్తానని, సిబ్బంది పనితీరుపై ప్రజల నుంచి ఏవైనా ఫిర్యాదులు అందితే తప్పక తగు చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అంతేగాకుండా ఏ సచివాలయ సిబ్బంది అయినా పనిచేయకుండా ప్రజల్ని ఇబ్బంది పెడుతుంటే తన సెల్ నం. 9849903371కి నేరుగా కాల్‌చేసి సమస్యను తెలిపితే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

జేఈఈ మెయిన్స్‌లో గీతమ్స్ పూర్వవిద్యార్థుల ప్రతిభ

వినుకొండ, ఫిబ్రవరి 16: ఆల్ ఇండియా స్థాయిలో విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గీతమ్స్ పూర్వ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి తెలిపారు. పూర్వవిద్యార్థి శావల్యాపురం మండలం కనమర్లపూడి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, సునీత దంపతుల కుమారుడు బి.విక్రాంత్ 99.89శాతం సాధించడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలో 10వ తరగతి వరకు చదుకొని 591 మార్కులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా పి.మౌని శ్రీలత 98.17 శాతం, యు.మణికంఠ 97.05శాతం, మరో 8మంది విద్యార్థులు 90శాతం పైబడి మార్కులు సాధించడంపై అభినందించారు.

బాధితులకు యరపతినేని పరామర్శ



నరసరావుపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 16: వైసీపీ ప్రభుత్వం వచ్చాక దుర్గి మండలం జంగమహేశ్వపాడులో దారుణ మారణకాండ జరిగిందని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జంగమహేశ్వరపాడులో వైసీపీ దాడిలో గాయపడి నరసరావుపేట ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను పరామర్శించారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ ఈ నాలుగు సంవత్సరాల పదినెలల్లో ఆ గ్రామంలో టీడీపీకి చెందిన అందరిని బయటకు పంపారన్నారు. టీడీపీ వర్గీయుల పొలాలు బీడులు పెట్టి, గృహాలలో లేకుండా చేసి ఇళ్ళలో కూడా చెట్లు మొలిచే పరిస్థితికి వచ్చాయన్నారు. అనిల్‌కుమార్ యాదవ్ వైసీపీ ఎంపీ అభ్యర్థిగా వచ్చినా మారరా? అని జంగమహేశ్వరపాడు బాధితులను దారుణంగా కొట్టారన్నారు. ఇలాంటి అరాచక శక్తులకు అండగా నిలుస్తున్న మాచర్ల పోలీసు వర్గాలు కూడా ఆలోచించుకోవాలన్నారు. రాత్రి దుర్గి ఎస్ఐ కోటయ్య ఇక్కడకు వచ్చి క్షతగాత్రులతో ఇష్టారాజ్యంగా మాట్లాడి కనీసం కేసుకూడా తీసుకోకుండా వెళ్ళరన్నారు. వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వం అని, తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు అట్లా చినవెంకటరెడ్డి, యువనాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరన్‌కుమార్, క్రాంతి, కార్యకర్తలు ఉన్నారు.

రేపు ప్రత్తిపాటి ఫౌండేషన్ మెగా వైద్య శిబిరం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 16: పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఈ నెల 18న ఉదయం 9 గంటల నుంచి ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ సెంటినీ ఆస్పత్రి వారి సౌజన్యంతో 35వ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసం వద్ద టీడీపీ నాయకులతో కలసి వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ మెగా వైద్య శిబిరంలో గుండె, థైరాయిడ్, కిడ్నీలు, జీర్ణాశయ సంబంధిత జబ్బులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. వైద్య పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేసేలా ఏర్పాటు చేశామన్నారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తాం

● వ్యాపారులతో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో కరపత్రాలు పంచుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 16: ఆర్యవైశ్య కార్పోరేషన్లను బలోపేతం చేస్తామని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని చలివేంద్రం బజారులో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ప్రత్తిపాటి పాల్గొన్నారు. దుకాణా వద్దకు వెళ్ళి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు సంవత్సరాలుగా జగన్ ప్రభుత్వ అరాచకాలపై విసిగి వేసారిపోయిన వర్తక వ్యాపారవర్గాలకు త్వరలోనే ఆ కష్టాల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. వ్యాపారస్తులకు వేధింపులు లేని స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. వ్యాపారులు గడిచిన ఐదు సంవత్సరాలుగా భయంగానే వ్యాపారాలు చేసుకోవాల్సి వచ్చిందని తమ ఆవేదనను వెళ్ళగక్కారు. టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు దిశగా వ్యాపారులు, వాణిజ్య వర్గాలన్నీ ఏకతాటి పైకి రావాలని ఆయన కోరారు. కొత్త ప్రభుత్వంలో మీ ఆస్తులకు పూర్తిగా రక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థిక సాయం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 16: పట్టణంలోని 9వ వార్డు జాలయ్య కాలనీకి చెందిన మల్లవరపు వెంకాయమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.10వేలు ఆర్థిక సాయాన్ని స్థానికుల ద్వారా అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోమేపల్లి సురేష్, ఆళ్ళ సీతారామిరెడ్డి, ఒంటిపులి వెంకట్, రాయి పద్మ, మండల వెంకటరావు, శివరామ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు, ఫిబ్రవరి 16: పేద కుటుంబాలకు ప్రత్తిపాటి ఫౌండేషన్ అండగా నిలుస్తోందని మండల టీడీపీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు పేర్కొన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడులోని ఎస్సీ కాలనీకి చెందిన కోడిరెక్క నాగేశ్వరరావు, కోడిరెక్క సామేలు, ఎస్టీ కాలనీకి చెందిన కుంభా అంజమ్మ, ముస్లిం కాలనీకి చెందిన షేక్ మాబులాలు ఇటీవల మృతిచెందారు. అలాగే ఎర్ర చెరువు ఎస్సీ కాలనీకి చెందిన దావల వెంకయ్య, ఎస్సీ కాలనీకి చెందిన బోరుగడ్డ స్రవంతి, రమణయ్యపేటకు చెందిన సయ్యద్ మాబు సుభానిలు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పార్టీ నాయకుల ద్వారా సమాచారం అందుకున్న మాజీ మంత్రి, ప్రత్తిపాటి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆయా కుటుంబాలను పరామర్శించి ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కరికి రూ.10వేలు ఆర్థికసాయాన్ని ప్రకటించారు. గురువారం రాత్రి మండల పార్టీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు ద్వారా రూ.70వేలు బాధిత కుటుంబాలకు ప్రత్తిపాటి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోపూరి వెంకటరత్తయ్య, ఉప్పలపాటి సీతారామయ్య, పోపూరి బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

ఈపూరులో ఉద్యోగ సంఘాల నిరసన

ఈపూరు, ఫిబ్రవరి 16: తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఈపూరు తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్ల రిబ్బలను ధరించి నిరసన తెలియజేశారు. ఎంపీడీవో కార్యాలయం, సామాజిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఉద్యోగులు నిరసన చేపట్టారు ఈసందర్భంగా ఈపూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఎస్.రామారావు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, నాలుగు డీఏలు, ఐఆర్ వంటి డిమాండ్లను పరిష్కరించే వరకు నిరసనలు తెలుపుతామన్నారు. నిరసనలో పంచాయతీ, సచివాలయాల, వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 16: పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని అరుణ హాల్ వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని బోడపాటి రామాంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు జి.అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పది విద్యార్థుల వీడ్కోలు సభ

శావల్యాపురం, ఫిబ్రవరి 16: స్థానిక జడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈవో మేడా వెంకటేశ్వర్లును హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కోలాట ప్రదర్శనతో ఆకట్టుకొన్న విద్యార్థుల బృందాన్ని డీఈవో ప్రత్యేకంగా అభినందించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించినపుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. విద్యార్థులకు పదో తరగతి తొలిమెట్టు లాంటిదని, పది పరీక్షలలో మంచి ఫలితాలు సాధించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించగలుగుతారన్నారు. ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, భువనేశ్వరి, శ్రీనివాసరాజు, సుబాష్‌చంద్రారెడ్డి, వెంకటరత్నం, రవికుమార్, అబ్దుల్లా, ఆదాంఖాన్, గురుబాబు, సురేష్, కోటేశ్వరరావు, విమలకుమారి, నిర్మలాదేవి, పీడీ రాధాకృష్ణ, రికార్డు అసిస్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.